పంటలకు మురుగునీరే దిక్కు..!



ఎస్.రాయవరంలో పంట కాలువలో పేరుకుపోయిన మురుగు



సాగునీరు కలుషితం కారణంగా సర్వసిద్ధిలో పాడైన రబీ వరి పంట



జేవీ పాలెం రబీ వరికి ఇంజన్‌తో మురుగునీరు పెడుతున్న రైతు

- పంట కాలువల్లోకి గ్రామాల్లో మురుగు మళ్లింపు
- కలుషిత సాగునీటితో పంటలకు తెగుళ్ల బెడద
- ఖరీఫ్ కన్నా రబీ సీజన్‌లో ఈ సమస్య మరింత అధికం

ఎస్.రాయవరం: పంటలకు మురుగునీరే దిక్కవుతోంది. కలుషిత సాగునీటి కారణంగా పంటలను తెగుళ్ల బెడద వేధిస్తోంది. గ్రామాలకు ఆనుకుని ఉన్న పంట కాలువల్లో మురుగునీరు పేరుకుపోతోంది. ఖరీఫ్‌లో కాస్త ఉపశమనం ఉన్నప్పటికీ రబీలో పూర్తిగా మురుగునీటిని పాలాలకు మళ్లించాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. మండలంలో పంటల సాగు వర్షాధారం కావడం వల్ల వరాహనది కాలువలు, తద్వారా వచ్చే నీటితో చెరువులు నిండి పిల్ల కాలువల ద్వారా వ్యవసాయానికి నీరు అందుతోంది.

ఎస్.రాయవరం గ్రామం మధ్య నుంచి ప్రవహించే కాలువలో పెద్ద ఎత్తున మురుగు పేరుకుపోయింది. ఈ కాలువ ద్వారా ఎస్.రాయవరం, సర్వసిద్ధి, ఉప్పరాపల్లి, సైతారుపేట, పేటసూదిపురం గ్రామాల పంట పొలాలకు సాగునీరు అందుతుంది. సర్వసిద్ధి, పేటసూదిపురం చెరువులు కూడా ఈ మురుగునీరు కలిసి కలుషితం అవుతున్నాయి. జేవీ పాలెం, సైతారుపేట గ్రామాల మీదుగా ఉన్న పంట కాలువకు యలమంచిలి మున్సిపాలిటీ నుంచి మురుగు వచ్చి చేరుతోంది. అదే నీటిని ఇంజన్ల సహాయంతో వరి పొలాలకు రైతులు మళ్లించుకునే దుస్థితి నెలకొంది. గుడివాడ శివారులో ఏకంగా సాయిమెరైన్ పరిశ్రమ వ్యర్థాలు నేరుగా వరాహ నది పాయ కాలువకు వదిలేస్తున్నారు. దీంతో ఈ కాలువపై ఆధారపడి ఉన్న వేలాది పంట పొలాలు చౌడు భూములుగా మారిపోతున్నాయి. ఈ పరిశ్రమ ఏర్పాటు నుంచి గుడివాడ, కొత్తపోలవరం, రేవుపోలవరం, బంగారమ్మపాలెం, పెదఉప్పలం, చినఉప్పలం గ్రామాల పంట పొలాలకు మురుగునీరు మళ్లించుకునే పరిస్థితి ఏర్పడింది. గోకులపాడు, తిమ్మాపురం, కొరుప్రోలు, ధర్మవరం, పెనుగొల్లు, లింగరాజుపాలెం తదితర గ్రామాల్లో సైతం పంట కాలువలు మురుకు కూపాలుగా మారిపోయాయి. దీంతో పంటల సాగుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా, నివారణకు సాధ్యం కాని తెగుళ్ల సోకి నష్టాలు చవి చూడాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ, నీటి పారుదల శాఖల అధికారులు స్పందించి పంట కాలువలను శుభ్రం చేయించి సురక్షిత సాగునీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



గుడివాడ సమీపంలో వరాహ నది పాయలోకి నేరుగా కలుస్తున్న పరిశ్రమ వ్యర్థాలు, కలుషిత నీరు

వ్యర్థాలతో తెగుళ్ల బెడద



పంట కాలువల్లోకి వ్యర్థాలు విడిచి పెట్టడం వల్ల పంటలు పూర్తిగా తెగుళ్ల బారిన పడుతున్నాయి. ఎక్కడో ఉన్న సాయి మెరైన్ కంపెనీ వ్యర్థాలు పెదఉప్పలం, చినఉప్పలం పొలాలకు చేరుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కోశెట్టి వెంకటరమణ, సర్పంచ్, పెదఉప్పలం

జిల్లా అధికారుల దృష్టికి సమస్య



ఎస్.రాయవరం గ్రామం మధ్యలో పంట కాలువ ఉండటం వల్ల డ్రైనేజీ నీరు కలిసిపోతోంది. ఈ నీటిని ప్రత్యామ్నాయం చేయడానికి మార్గం లేదు. ట్రీట్‌మెంట్ ప్లాంట్ పెట్టి నీటిని తరలించేందుకు రూ.4 కోట్లు వ్యయం అవుతోంది. సమస్యను జిల్లా అధికారుల దృష్టిలో పెట్టాం. అంత వరకు సమస్య తలెత్తకుండా వ్యవసాయ, నీటి పారుదల శాఖ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించాం.

– సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో, ఎస్.రాయవరం మండలం



జేవీపాలెం పంట కాలువలో నల్లని మురుగునీరు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతులు చేపట్టే క్రమంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. గుడివాడ ఫీడర్‌లో పెదఉప్పలం, చినఉప్పలం, గుర్రాజుపేట, గుడివాడ, కె.పోలవరం, రేవుపోలవరం, బంగారమ్మపాలెం గ్రామాలకు, సోమిదేవపల్లి ఫీడర్‌లో కొబ్బరి పీచు పరిశ్రమలకు, ఆక్వా పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

ఎస్‌ఐ రమేష్‌కు సత్కారం



ఎస్‌ఐ రమేష్‌ను సత్కరిస్తున్న చౌడువాడ గ్రామస్తులు

కోటవురట్ల: కైలాసపట్నం గ్రామంలోని విజయలక్ష్మి గణేష్ ఫైర్ వర్క్స్‌లో ఆదివారం జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో 8 మృతి చెందగా మరో ఎనిమిది చికిత్స పొందుతున్నారు. ఇందులో మరొకరు పరిస్థితి విషమించి మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే హుటాహుటిన ఎస్‌ఐ రమేష్ సంఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకుని సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొని క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి పలువురిని ప్రమాదం నుంచి కాపాడారు. పేలుళ్లు జరుగుతున్నా ధైర్యంగా సహాయక చర్యల్లో పాల్గొనడమే కాకుండా సకాలంలో అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు వచ్చేలా చేసి ప్రమాద తీవ్రతను తగ్గించడంలో దోహదపడ్డారు. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ రమేష్‌ను చౌడువాడ సర్పంచ్ శానాపతి గోపాలకృష్ణతో పాటు పలువురు గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సత్కరించారు.

నిర్మానుష్యంగా మునగపాక మెయిన్ రోడ్డు



కర్ఫ్యూను తలపిస్తున్న మునగపాక మెయిన్‌రోడ్డు

మునగపాక: వేసవి తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడు ప్రతాపం చూపాడు. రైతులు పొలం పనులు వేగంగా ముగించుకొని ఇళ్లకు చేరుకున్నారు. ఉదయం 11 గంటలకే ఎండ తీవ్రత కారణంగా మునగపాక మెయిన్ రోడ్డు నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. అత్యవసర పనులు ఉన్న వారు మాత్రం తగు జాగ్రత్తల నడుమ రాకపోకలు సాగించారు. మొత్తమ్మీద ఎండ తీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

కోర్టు కేసులు తేలాకే.. లంక హరికి న్యాయం!

అచ్యుతాపురం రూరల్ : లంక ధర్మవరం గ్రామానికి చెందిన లంక హరినాగ శంకర్రావు భూ రికార్డుల విషయంలో పెండింగ్‌లో ఉన్న రెండు కోర్టు కేసులు తేలిన తరువాతే సమస్య పరిష్కారం అవుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. అధికారులు రికార్డులు తారుమారు చేశారని, తనకు న్యాయం కావాలి అంటూ గురువారం సెల్ టవర్‌పై నిరసన తెలిపిన వ్యక్తిపై వచ్చిన కథనాల మేరకు శుక్రవారం అధికారులు క్షేత్ర స్థాయి విచారణ చేపట్టి కోర్టులో ఉన్న రెండు కేసులు ఫైనల్ అయితేనే కానీ తనకు న్యాయం చేయలేమంటూ బదులిచ్చారు. మరో ఆర్‌ఓఆర్ అపీల్ కేస్ కూడా పరిష్కారం అవ్వాలన్నారు.

మంచినీరు ఇవ్వండి మహాప్రభో?



బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రావికమతం: తాగడానికి మంచినీరు ఇవ్వండి మహాప్రభో అంటూ చీమలపాడు పంచాయతీ అజేయపురం గ్రామానికి చెందిన గిరిజనులు ఖాళీ బిందెలతో శుక్రవారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో 30 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి తాగునీటి సౌకర్యం కోసం 2019లో 15 ఆర్థిక సంఘం నుంచి రూ.8.40 లక్షలతో వాటర్ స్కీం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో 15 రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈ నెల 15వ తేదీన వాటర్ ట్యాంక్‌పై ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. నేటికీ ఆ శాఖ అధికారులు స్పందించలేదు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి కనెక్షన్ ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాంగి చంద్రయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు కోరుతున్నారు.

వాహన తనిఖీలు

మునగపాక: ప్రతి ఒక్కరూ వాహన రికార్డులు వెంట ఉంచుకోవాలని ఏఎస్‌ఐ మన్మథరావు సూచించారు. శుక్రవారం రాత్రి మునగపాకలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం సరికాదన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం

- తీరుమార్చుకోకపోతే పీడీ యాక్టు
- ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్



నర్సీపట్నం: స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని నర్సీపట్నం, రోలుగుంట, కోటవురట్ల, మాకవరపాలెం మండలాల్లో సారా తయారీ, విక్రయాలు, రవాణాపై విస్తృతంగా దాడులు చేపడుతున్నామని సీఐ కె. సునీల్ కుమార్ తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా తయారీ స్థావరాలపై నిరంతరం దాడులు చేస్తున్నామన్నారు. సారా ప్రభావిత గ్రామాలను కేటగిరీల వారీగా విభజించామన్నారు. కేటగిరీ(ఎ) గ్రామంలో 6 కేసులు, ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. 34.5 లీటర్ల సారా, 3,600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం చేశామన్నారు. కేటగిరీ(బి) గ్రామాల్లో నాలుగు కేసుల్లో నలుగురు నిందితులను అరెస్టు చేసి, 21 లీటర్ల సారా, 320 లీటర్ల బెల్ల ఊటను ధ్వంసం చేశామన్నారు. కేటగిరీ (సి) గ్రామాల్లో మూడు కేసుల్లో నలుగు నిందితులను అరెస్టు చేశామన్నారు. సాధారణ గ్రామాల్లో 14 కేసుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేసి, 104 లీటర్ల సారా, 6,520 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. 54 మందిపై బైండోవర్ కేసులు పెట్టామన్నారు. బైండోవర్ కేసు ఉండి కూడా సారా విక్రయం, తయారీ, రవాణా చేస్తూ పట్టుబడితే రూ.2 లక్షలు అపరాధ రుసుం విధిస్తామన్నారు. తీరు మార్చుకోకపోతే పీడీ యాక్టు ప్రయోగిస్తామన్నారు.

మత్స్యకార భరోసా రూ.40 వేలు చెల్లించాలి



ఎఫ్‌డీవోకు వినతిపత్రం అందిస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: ప్రతి ఏటా వేట నిషేధ సమయంలో ఇచ్చే మత్స్యకార భరోసాను తక్షణమే విడుదల చేయాలని పలువురు మత్స్యకారులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజయ్యపేటకు చెందిన మత్స్యకారులు ఫిషరీస్ అసిస్టెంట్ త్రినాథ్‌కు వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భరోసాను రూ.20వేలకు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. గత ఏడాదికి సంబంధించిన మత్స్యకార భరోసా ఇంత వరకు చెల్లించలేదన్నారు. గత ఏడాది, ఈ ఏడాది కలిపి రూ.40 వేలు మత్స్యకార భరోసా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే గత ఏడాది వేట నిషేధం అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు మైలపల్లి మహేష్ బాబు, పేర్ల నల్ల, పిక్కి నూకరాజు, గోసల కాశీ, పిక్కి కాశీ, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో చేరేందుకు వచ్చే నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.200, ఎస్సీ, ఎస్టీలకు రూ.150 చొప్పున రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

- ఈ నెల 21న ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. స్కూల్ ఆవరణలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



చిన్నోడుపాలెంలో చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని ఎమ్మెల్యే విజయకుమార్ తెలిపారు. మండలంలోని పాటిపల్లి పంచాయతీ చిన్నోడుపాలెంలో ఏషియన్ పెయింట్స్ సహకారంతో రూ.15 లక్షల వ్యయంతో తలపెట్టిన చెరువు పునరుద్ధరణ పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, మళ్ల కాలేశ్వరరావు, కోరుకొండ రాజు, ఆడారి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్, అంబుజా సీఎస్‌ఆర్ నిధులతో చెరువుల అభివృద్ధి

అచ్యుతాపురం రూరల్ : ఏషియన్ పెయింట్స్, అంబుజా సిమెంట్ సీఎస్‌ఆర్ నిధులతో మండలంలో మూడు చెరువుల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఆవరాజాం, దోసూరు, మడుతూరు గ్రామాల్లోని చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. ఆవరాజాంలో రూ.8.74లక్షలు, దోసూరులో రూ.11.72 లక్షలు, మడుతూరులో రూ.11.43 లక్షలు వ్యయంతో ఏషియన్ పెయింట్, అంబుజా సిమెంట్ యాజమాన్యాలు చెరువులు అభివృద్ధి చేయడంపై ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ ఏజీఎం మౌనిక్ చటర్జీ, సీనియర్ మేనేజర్ హెచ్ఆర్ రూపేష్ కుమార్, మేనేజర్ హెచ్ఆర్ శ్రీజిత్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ హెచ్ఆర్ ఉదయ్ భాస్కర్ చిత్రాడ, అంబుజా ఫౌండేషన్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ మహేంద్ర వద్వానీ, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ కె.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు

- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న



రైతులకు సబ్సిడీపై నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న

చోడవరం: ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులకు మంచి పంట దిగుబడి వస్తుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న తెలిపారు. మండలంలో చాకిపల్లి గ్రామంలో సర్పంచ్ పోతల జానకీప్రసాద్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమౌతున్న సమయంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ఉపయోగాలను ఈ సందర్భంగా వివరించారు. తొలకరి వర్షాలకు ముందే ప్రకృతి వ్యవసాయం విధానంలో భూమిని సంరక్షిస్తే ఏడాదంతా పంటకు మేలు చేస్తుందని సూచించారు. పంటకు కావలసిన సూక్ష్మ, స్థూలపోషకాలు అందుబాటులోకి వస్తాయన్నారు. నవధాన్యాలు సాగుచేయడం వల్ల పశువులకు మంచిన పోషాకారం లభివస్తుందన్నారు. నేల గుల్లబారి వానపాములు అభివృద్ధి చెందుతాయని, నేలలో నీటినిలువ సామర్థ్యం పెరుగుతుందన్నారు. మిశ్రమ పంటలు వేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందని, ప్రధానంగా రసాయన ఎరువుల వినియోగం పూర్తిగా తగ్గించాలన్నారు. అంతేకాకుండా కలుపు తగ్గుతుందని, పంటలు తెగుళ్ల నుంచి రక్షించబడతాయని, పంట దిగుబడి బాగా వస్తుందని సూచించారు. ఈ సందర్భంగా చోడి పంట ఎంతో లాభదాయకమని ఎక్కువగా సాగు చేయడం మంచిదని స్టేట్ రిసోర్స్ పర్సన్ దేముళ్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై అపరాలు, నవధాన్యాల విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ నాగమణి, చిన్న, నాయుడుబాబు, కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



యలమంచిలి సెయింట్ మేరీస్ స్కూల్‌లో గుడ్ ఫ్రైడే సన్నివేశాలు తిలకిస్తున్న క్రైస్తవ విశ్వాసులు

- క్రైస్తవులతో చర్చిలు కళకళ
- ప్రత్యేక ప్రార్థనలతో మార్మోగిన మందిరాలు
- ఆకట్టుకున్న క్రీస్తు శిలువ మోసే సన్నివేశాల ప్రదర్శనలు

యలమంచిలి రూరల్: క్రీస్తుకు శిలువ వేసే గుడ్ ఫ్రైడే ప్రార్థనలు యలమంచిలి పట్టణంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. లోక రక్షకుడైన క్రీస్తు.. సర్వ మానవ పాప విముక్తి కోసం మరణ శిక్ష పొందిన రోజును శుభ శుక్రవారంగా పేర్కొంటూ యలమంచిలి పట్టణం, మండలంలోని గ్రామాల్లో క్రైస్తవ విశ్వాసులందరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కరుణామయుడు శిలువ మోసిన రోజును స్మరించారు. యలమంచిలి పట్టణంలోని పురాతన రోమన్ కేథలిక్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన గుడ్ ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా క్రీస్తుకు శిలువ వేసే ఇతి వృత్తాంతాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనతో పాటుగా చర్చి నుంచి పుర వీధుల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా వెళ్లారు. అనంతరం స్థానిక సెయింట్ మేరీస్ స్కూల్ ఆవరణలో శిలువ వేసే సన్నివేశాన్ని పూర్తి చేశారు. ఈ సన్నివేశాల్లో క్రీస్తు వేషం ధరించిన దిలీప్‌ను పలువురు ప్రశంసించారు.

కోటవురట్ల: స్థానిక క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చి, ఎల్‌షద్దాయి ఆరాదన సంఘం, బెతస్థా ప్రార్థనా మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు బోధనలు వినిపించి ఆయన చూపిన శాంతిమార్గంలో నడవాలని పాస్టర్లు పిలుపునిచ్చారు.

ఎస్.రాయవరం: మండలంలో అడ్డురోడ్డు–తిమ్మాపురం క్రీస్తు జ్యోతి దేవాలయంలో సంఘ సభ్యులు క్రీస్తు శిలువ వేసే సన్నివేశాన్ని ప్రదర్శించారు. అడ్డురోడ్డు జంక్షన్ మీదుగా తిమ్మాపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అడ్డురోడ్డు కూడలిలో శిలువ వేసి క్రీస్తు మరణించే ఘట్టాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పలు గ్రామాల్లోని చర్చిల్లో కూడా



యలమంచిలి ఆంధ్రా సెంటినరీ బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



కోటవురట్ల కేకేబీ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలోని కాకివాని వీధిలో ఉన్న చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పరిశుద్ధ క్రీస్తు మార్గంలో నడుచుకోవాలని సంఘ కాపరి అగస్టీన్ రాజు ఉపదేశించారు. ఈ కార్యక్రమంలో చర్చి పాలక వర్గ సభ్యులు మేసెస్, ఆనంద్, రమణ, శామ్యూల్, కరుణవేణి, శ్యామల పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



అక్రమ మద్యం పట్టుకున్న పోలీసులు

మునగపాక : ఒడిశా నుంచి అక్రమంగా బీర్ బాటిళ్లను తీసుకువెళుతున్న వ్యక్తిని అరెస్టు చేసి కారును సీజ్ చేసినట్టు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గురువారం రాత్రి ఎస్‌ఐ ప్రసాదరావు నేతృత్వంలో వాహన తనిఖీలు నిర్వహించారు. కాకినాడకు చెందిన వ్యక్తి ఒడిశా రాష్ట్రం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా 105 టిన్‌బీర్లను రవాణా చేస్తుండడంతో గుర్తించి అతనిని అరెస్టు చేశారు. బీర్ బాటిళ్లను తరలిస్తున్న కారును సీజ్ చేసినట్టు తెలిపారు.

ఉపాధి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలతో సీఐటీయూ నాయకుడు రొంగలి రాము

అచ్యుతాపురం రూరల్ : మండలంలో సుమారు కోటి రూపాయల వరకూ బకాయిపడ్డ ఉపాధి హామీ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. శుక్రవారం కొండకర్ల పంచాయతీలో ఉపాధి హామీ కూలీలతో కలిసి ఏడు వారాలుగా బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. నెలల తరబడి ఉపాధి హామీ బకాయిలు చెల్లించకపోతే కూలీలు ఏవిధంగా జీవనం సాగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తట్టా, గునపం, పార, మంచినీళ్లు, ట్రావెలింగ్, సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారని, అవి ఇప్పుడు పూర్తిగా కట్ చేసి రూ.7 పెంచినట్టు ప్రకటించడం అన్యాయమన్నారు. ఉపాధి హామీ శాఖకు మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ కూలీల కష్టాలు అర్థం చేసుకోకపోవడం విచారకరమన్నారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో అనకాపల్లి మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ ప్రకటించారని, అయితే పనిచేసిన కూలీలకు వేతనాలు చెల్లించడంలో కూడా మొదటి స్థానంలో ఉండాలి కదా అని ప్రశ్నించారు.

పంట కోతలను వాయిదా వేసుకోండి

అనకాపల్లి : వర్ష సూచన ఉన్నందున వరి కోతను వాయిదా వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. వర్ష సూచన ఉన్నందున, రాగి పైరు కోతను వాయిదా వేసుకోవాలని, ఒక వేళ ఇప్పటికే కోసి ఉంటే నీడగా ఉన్న స్థలంలో ఆరబెట్టుకోవాలన్నారు. నువ్వులలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వేరు, కాండం కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా మాంకోజెట్‌ను లీటరు నీటికి 3 గ్రా. చొప్పున కలిపి మొక్కల మొదళ్లు తడిచేల పిచికారి చేయాలన్నారు. నువ్వులను నిలువ చేసేటప్పుడు పురుగు పట్టకుండా కిలో నువ్వులకు 5 గ్రా. వేపాకుపొడి లేదా 5 మీ.లి వేప నూనె కలుపుకోవాలన్నారు. వేరుశనగ పైరు కోతను వాయిదా వేసుకోవాలన్నారు. వర్షం వల్ల వచ్చే తేమను ఉపయోగించుకుని 45రోజుల కార్సి చేసిన చెరకు తోటల్లో ఎకరాలకు 150 కిలోల చొప్పున యురియాను మొక్కల మొదల్ల దగ్గర చిన్న గుంతలు తీసీ వేసుకోవాలని, చెరకులో ప్రస్తుత వాతావారణ పరిస్థితులకు కొరడా తెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు ప్రొపికోనజోల్ 1 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. 45, 90 రోజుల చెరకు వయసు గల మొక్క తోటల్లో, రాగల వర్షాన్ని ఉపయోగించుకుని ఎకరాకు 75 కిలోల యూరియాను మొక్కల మొదళ్ల దగ్గర చిన్న గుంతలు తీసి వేసుకోవాలన్నారు. వర్ష సూచన ఉన్నందున పక్వానికి వచ్చిన అరటి గెలలను వీలైనంత త్వరగా కోసి మార్కెట్‌కు తరలించాలన్నారు.